సర్కారు బడిలో సమస్యలెన్నో..

- గ్రామానికి దూరంగా నూతన భవనం
- వేధిస్తున్న తరగతి గదుల కొరత
- మరుగుదొడ్లు లేక పాట్లు
- చెరువు పక్కనే ఉండటంతో విషసర్పాల సంచారం
- ప్రహరీ లేక రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు


తరగతి గదులు నిర్వహిస్తున్న షెడ్లు ఇవే


చెరువు పక్కనే ప్రహరీ లేకుండా నిర్మించిన పాఠశాల నూతన భవనం

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట జెడ్పీహెచ్ఎస్ సమస్యలతో సతమతమవుతోంది. 44వ జాతీయరహదారి పక్కన గ్రామంలో ఉన్న పాఠశాలను ఖాళీ చేయించి గ్రామానికి కొంత దూరంలో పెద్దచెరువు సమీపంలో నూతన భవనం నిర్మించారు. అయితే ఇక్కడ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదుల్లేవు. ఇప్పుడున్న 7గదుల్లోనే తెలుగు, ఇంగ్లిష్ మీడియం తరగతులను వేర్వేరుగా నిర్వహించాల్సి వస్తోంది. దీంతో పాఠశాల నిర్మించే క్రమంలో ఏర్పాటుచేసిన షెడ్లలో మూడు తరగతులను కొనసాగిస్తున్నారు. మరుగుదొడ్లు లేక విద్యార్థులు మలమూత్ర విసర్జనకు ఆరుబయటకు వెళ్తున్నారు. చెరువులోని చెట్లపొదల్లోకి వెళ్తుండటం ప్రమాదకరంగా మారింది. పాఠశాల చుట్టు ప్రహరీ నిర్మించలేదు. చెరువు పక్కనే ఉండటంతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. ప్రహరీ లేకపోవడంతో రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆ పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌వి ప్రజా వ్యతిరేక విధానాలు

- మున్సిపల్ మాజీ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్


మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్

భూత్పూర్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్నది ప్రజా వ్యతిరేక విధానాలు అని మున్సిపల్ మాజీ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం భూత్పూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. సామాజిక మాధ్యమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేయడం లేదని పోస్టులు పెడితే వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. అక్రమ కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో కాంగ్రెసోళ్లపై కేసులు పెట్టిన దాఖలు లేవన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు గౌడ్, మురళీధర్ గౌడ్, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణగౌడ్, మహ్మద్ సాదిక్, నరేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న యువకులు, గ్రామపెద్దలు

దేవరకద్ర: మండలంలోని చిన్నరాజమూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈనెల 19 న శివాజీ జయంతి రోజున విగ్రహాన్ని ఏర్పాటుచేసి ప్రారంభిస్తామని గ్రామస్తుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

లైన్ల మార్పు పనులను పరిశీలించిన ఎస్ఈ


కేబుల్ చెకింగ్ కోసం తెప్పించిన వ్యాన్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని టీఎన్‌జీఓ భవనం ఎదురుగా కాలనీలో విద్యుత్ లైన్ల మార్పు పనులను ఆదివారం ఎస్ఈ రమేష్ పరిశీలించారు. 33కేవీ, 11కేవీ లైన్లు ఒకే స్తంభానికి ఉండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. వీటికి సంబంధించిన లైన్లు అండర్‌గ్రౌండ్‌లో ఉండటంతో రెండు రోజుల క్రితం షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయాయి. దీంతో కేబుల్ పరిశీలించేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనాన్ని తెప్పించారు. ఆ వాహనం సహాయంతో కేబుల్‌ను పరిశీలించి షార్ట్ సర్క్యూట్ అయిన చోటు గుర్తించి కేబుల్ మార్చారు. దీంతోపాటు 33కేవీ, 11 కేవీ లైన్లను వేరు చేశారు. డీఈ చంద్రమౌళి, ఏడీఈ చంద్రశేఖర్ పర్యవేక్షించగా ఏఈ ఎర్రన్న, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, లైన్‌మెన్లు రవికుమార్, మతీన్‌లు దగ్గరుండి పూర్తిచేశారు.

అమ్మమ్మ, మనవడు అదృశ్యం


సత్యమ్మ


ఆదిత్య

నవాబుపేట: అమ్మమ్మ వెంట వచ్చిన బాలుడు తిరిగి అమ్మమ్మతో కలిసి తన తల్లిదండ్రుల చెంతకు వెళ్తుండగా ఇద్దరు అదృశ్యమైనట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. వివరాలు.. యన్మన్‌గండ్లకి చెందిన సంపూర్ణ అనే మహిళ తన భర్త, పిల్లలతో కలిసి శంషాబాద్‌లో నివాసం ఉంటుంది. సంక్రాంతి పండగ సందర్భంగా గతనెలలో సంపూర్ణ తల్లి సత్యమ్మ శంషాబాద్‌కు వచ్చి ఆమె కుమారుడు ఆదిత్య(4)ను పండగ కోసం తనతో పాటు యన్మన్‌గండ్లకి తీసుకువచ్చింది. శంషాబాద్‌లో సంపూర్ణ కుటుంబం కూలిపని చేసుకుంటుండటం మూలంగా కుమారుడు తన తల్లిదగ్గర కొన్ని రోజులు ఉంచింది. కాగా ఈనెల 14న తన మనవడు ఆదిత్యను తీసుకొని అమ్మమ్మ సత్యమ్మ శంషాబాద్‌కు బయలుదేరింది. కాగా నేటికీ ఆమె కూతురి చెంతకు చేరలేదు. దీంతో సంపూర్ణ ఆదివారం నవాబుపేటకు వచ్చి తన తల్లి, కుమారుడు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మార్మోగిన శివనామస్మరణ


నారాయణపేట జిల్లా కేంద్రంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

నారాయణపేట/నారాయణపేట రూరల్/ఊట్కూరు/ధన్వాడ: జిల్లా కేంద్రంలో ఆదివారం శివనామస్మరణ మార్మోగింది. మహంకాళి వీధిలోని శివాలయంలో ఆదిదేవుడి మహాపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శివస్వాములు జ్యోతి, కలశాలతో గణేష్ మార్గం మీదుగా భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం గురుస్వాములు సత్యయాదవ్, కన్నా జగదీశ్, బండి గోపాల్ రెడ్డి నర్సింహ స్వామి, గిరప్ప ఆధ్వర్యంలో మహాదేవుడికి మహాపూజ, రుద్రాభిషేకం, శివాష్టకం, అభిషేకం, బిల్వాష్టకంను వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

➩ నారాయణపేట మండలంలోని జాజాపూర్లో ఆదివారం శివస్వాముల మహా పడిపూజ కార్యక్రమం కనులపండువగా జరిగింది. స్థానిక శివాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాలతో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటుచేసి.. గురుస్వామి రాజ్ కుమార్, పవన్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పాలంకరణ, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అంతకుముందు స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకీలో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

➩ ఊట్కూరు మండలంలోని ఓబులాపూర్ శివాలయంలో శివస్వాముల ఇరుముడిధారణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, అలంకరణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్‌గా కొత్వాల్


ఒబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోఆర్డినేటర్‌గా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ నియమితులయ్యారు. నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఆయన కోఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు. నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్లను సమీకరించి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని కొత్వాల్ తెలిపారు.

రైలు ఢీకొని రెండు ఎద్దులు మృతి


మృతి చెందిన ఎద్దులు

దేవరకద్ర రూరల్: రైలు ఢీకొని రెండు ఎద్దులు మృతి చెందిన ఘటన ఆదివారం కౌకుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పుట్టపల్లికి చెందిన రైతు గొల్ల కురుమూర్తి తన ఎద్దులను తీసుకొని పొలానికి వెళ్తున్నాడు. ఆదే సమయంలో అటుగా వెళ్తున్న రైలు శబ్దం చేయడంతో ఎద్దులు భయపడి పట్టాల వైపుగా పరిగెత్తడంతో రైలు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో రెండు ఎద్దులు అక్కడిక్కడే మృతి చెందాయి. మృతి చెందిన ఎద్దుల విలువ దాదాపు రూ.2లక్షల వరకు ఉంటుందని, వీటిపైనే ఆధారపడి జీవిస్తున్నట్లు బాధిత రైతు వాపోయాడు. అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

జడ్చర్ల తహసీల్దార్ బదిలీ

జడ్చర్ల టౌన్: తహసీల్దార్‌గా పనిచేస్తున్న బ్రహ్మంగౌడ్‌ను సీసీఎల్‌కు బదిలి చేశారు. ఆయన స్థానంలో మక్తల్‌లో పనిచేస్తున్న నర్సింగ్‌రావును జడ్చర్ల తహసీల్దార్‌గా నియమించారు. అలాగే నయాబ్ తహసీల్దార్‌గా ఉన్న రాజీవ్‌రెడ్డి కలెక్టరేట్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో కిశోర్ ఇక్కడికి రానున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగుల ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల ఏ ఒక్క సమస్యను పరిష్కరించకపోవడం వల్లే ఉద్యోగులంతా ఏకమై రాష్ట్రంలో ప్రభుత్వ మార్పునకు శ్రీకారం చుట్టారన్నారు. జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు, పీఆర్‌సీ నివేదికను ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలని కోరారు. గత రెండేళ్లుగా ఈ-కుబేర్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆల్‌మేవా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అయూబ్, అబ్దుల్ ఖాదర్, రాష్ట్ర కార్యదర్శి షేక్ ఫరీద్, నాయకులు సయ్యద్ ఖాజా నిజాముద్దీన్, సిరాజ్‌ఖాన్, ముఖ్తార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహా మండపం నిర్మాణానికి సర్వే



చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ప్రధాన ఆలయం ధ్వజస్తంభం ముందు మహా మండపం నిర్మాణం చేపట్టేందుకు ఆదివారం అధికారులు ఆలయం వద్ద సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కురుమూర్తిస్వామి దర్శనానికి దినదినాన భక్తుల తాకిడి అధికం అవుతుందన్నారు. ముఖ్యంగా అమవాస్య, స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తుల సంఖ్య పెరుగుతుందని అన్నారు. దీంతో స్వామివారి దర్శనానికి భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిల్చుంటున్నారన్నారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మహా మండపం నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

వ్యాయామం తప్పనిసరి



జడ్చర్ల టౌన్: ప్రస్తుత కాలంలో ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడంతో పాటు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండేందుకు వ్యాయామం తప్పనిసరి అని న్యూమాంక్స్ కుంగ్‌ఫు రాష్ట్ర చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ నక్క బాల్‌రాజ్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన బెల్టుగ్రేడ్ పరీక్షల్లో ఆయన పాల్గొని విద్యార్థులకు బెల్టులు ప్రదానంచేశారు. ఈసందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ చదువుతోపాటు కుంగ్‌ఫు శిక్షణ అవసరమని అన్నారు. ఇన్‌స్ట్రక్టర్లు రమేష్, రాములు, జనార్దన్‌రెడ్డి, నరేష్, హనుమంతు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సంతలో అన్నదానం



నవాబుపేట: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం జరిగే సంతకు వచ్చే జనాల కోసం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి ఉచిత భోజనం అందిస్తున్నారు. ఆరునెలలుగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. సంతకు వచ్చే మారుమూల గ్రామాల ప్రజలు ఈఅవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. సంతకు వచ్చి తిరిగి వెళ్లేందుకు రాత్రి అవుతుండటంతో వారికి మధ్యాహ్నం భోజనం అందించి ఆకలి తీరుస్తుడటంతో ఈకార్యక్రమం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార సంఘం మండలాధ్యక్షుడు సుధాకర్‌చారి, పుట్టి ఆంజనేయులు, రఘువీర్‌శర్మ, నిరంజన్, లక్ష్మీనర్సింహాచారి, గీతారాణి, విశ్వనేత్ర, చందు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



నవాబుపేట: మండలంలోని కారుకొండ జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 1996–97 విద్యాసంవత్సరం విద్యార్థులు జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు కృష్ణయ్య, రాంరెడ్డి, వెంకటరెడ్డి, జీహెచ్ఎం దశరత్‌నాయక్‌ను వారు సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేశారు. పాఠశాల అభివృద్ధిలో తాము భాగస్వాములుగా మారుతామని వివరించారు. నరేందర్, స్వప్న, రజిత, అరుణ, బుచ్చయ్య, వెంకటేష్‌గౌడ్, సత్యయ్య, జనార్దన్, గోవర్ధన్, నిర్మల ఉన్నారు.

జేఈఈ టాపర్‌కు సన్మానం



దేవరకద్ర: స్థానిక మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో చదువుతున్న మహమ్మద్ సల్మాన్ అనే విద్యార్థి జేఈఈలో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడంతో ఆదివారం మైనార్టీ నాయకులు మహమ్మద్ సల్మాన్‌ను, అతడి తండ్రి ఖాదర్‌ను ఘనంగా సన్మానించారు. తనకు ర్యాంక్ రావడానికి తల్లిదండ్రులు, గురువుల స్నేహితుల సహకారం ఉందని సల్మాన్ పేర్కొన్నాడు. నాయకులు సయ్యద్‌ఫారూఖ్, జమీల్, ఇనాయత్‌అలీ, కుత్బు, ఖలీద్, అంజద్‌అలీ, వాయిద్‌అలీ, రెహమాన్, మాజీద్ ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

జడ్చర్ల టౌన్: మండలంలోని బూర్గుపల్లికి చెందిన కావలి మల్లయ్య గుండెపోటుతో మృతిచెందాడు. ఆదివారం అతడి స్నేహితులు బాధిత కుటుంబానికి రూ.51వేల ఆర్థికసాయాన్ని అందించారు. విఠాల సంతోష్‌కుమార్, రాజేష్, తాహెర్, మల్లికార్జున్, నారాయణ, రమణ, రామకొండ భీమయ్య, కిట్టు, రాధాకృష్ణ, శివ, బాలకృష్ణ, లింగారెడ్డి ఉన్నారు.

నేటి నుంచి శ్రీమునిరంగస్వామి బ్రహ్మోత్సవాలు


మునిరంగస్వామి దేవాలయ ముఖద్వారం

భూత్పూర్: మండల కేంద్రంలోని శ్రీమునిరంగస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తుల కోరికలు తీర్చే దైవంగా ప్రసిద్ధి చెందిన మునిరంగస్వామి బ్రహ్మోత్సవాలకు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు. 17న మునిరంగస్వామి ఊరేగింపు, 18న రథోత్సవం, 19న శకటోత్సవం, 20న పుట్టసేవ, 21న స్వామివారి ఉత్సవాలు, 22న కల్యాణోత్సవం, 23న పల్లకీసేవ, 24న అవభృతి, అభిషేకం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం ఎల్లప్ప, నిర్వాహకులు బోరంగ్ నర్సింహులు తెలిపారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో పతకాలు


పతకాలు అందుకున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన 4వ ఇంటర్‌స్టేట్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు జీకే మాస్టర్ షోటోకాన్ కరాటేడూ ఇండియా పట్టణ ఉపాధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. ఆయా విభాగాల్లో వి.సాయి వర్షిణి, ఆర్.ప్రకాశ్ బంగారు పతకాలు, కె.శ్రీచరణ్ చారి రజత పతకం పొందినట్లు తెలిపారు. విద్యార్థులకు తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ ట్రెజరర్ రామస్వామి పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు పతకాలు సాధించడంపై జీకే మాస్టర్ షోటోకాన్ చీఫ్ జి.కృష్ణయ్య హర్షం వ్యక్తంచేశారు. విద్యార్థులకు కరాటే శిక్షణ అందజేస్తున్న మాస్టర్లు నవీన్‌కుమార్, తిమ్మప్పను అభినందించారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు


ప్రజాపాలన సేవాకేంద్రం వద్ద ఎంపీడీఓ ప్రభాకర్

భూత్పూర్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నవంబరు, డిసెంబర్‌లో ఆర్థిక, విద్య, రాజకీయ కుల సర్వేల్లో తమ పేర్లను నమోదు చేసుకొని వారు ఈ ప్రజాపాలన సేవాకేంద్రంలో తమపేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యాలయ సమయ వేళలో ప్రజాపాలన సేవాకేంద్రంలో సర్వే ఫాం నింపి ఇవ్వడానికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెలిపారు. సర్వేలో పాల్గొనని కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు


పర్వాతాపూర్ మైసమ్మ ఆలయం వద్ద భక్తులు

నవాబుపేట: మండలంలోని పర్వాతాపూర్ మైసమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. జనంతో మైసమ్మ ఆలయ, అడవి ప్రాంతంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కనీస వేతనం ఇప్పించాలని వినతి


జాన్‌వెస్లీకి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇప్పించేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేష్ కోరారు. ఆదివారం మహబూబ్‌నగర్‌కు వచ్చిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి వినతి పత్రం సమర్పించారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, కార్మికులందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ పథకం కింద నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కావలి కేశవులు, తెలుగు సత్తయ్య, కేశవులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు ఉపాధి భద్రత కల్పించాలి


పోస్టర్ విడుదల చేస్తున్న టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం హమాలీలకు ఉపాధి భద్రతతో పాటు సమగ్రమైన చట్టం రూపొందించాలని టీయూసీఐ (ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలంలోని అభంగపట్నంలో హమాలీ, మిల్‌వర్కర్స్ యూనియన్ కార్మికులతో కలిసి ఈనెల 21న ఖమ్మంలో జరిగే రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. మండలంలోని కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు నారాయణ, ఆంజనేయులు, కేశవులు, శేఖర్, వెంకటయ్య, రాకమయ్య, శ్రీశైలం, సత్యం, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

గుంతల మయం

- ముచ్చింతల–తిర్మలాపూరం బీటీ రోడ్డు


గూడూరు గేట్‌వద్ద బీటీ రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి స్వామి ఆలయానికి చేరుకునే ముచ్చింతల–తిర్మలాపూరం బీటీ రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కురుమూర్తి స్వామి జాతరను పురస్కరించుకొని గత నవంబర్ నెలలో రోడ్డుకు నామమాత్రంగా పనులు చేపట్టి గుంతలను పూడ్చారు. ఉత్సవాలు ముగిసే సమయానికే రోడ్డుకు గుంతలు యథావిధిగా ఏర్పడ్డాయి. అధికారులు మళ్లీ గుంతలపై దృష్టిసారించలేదు. తిర్మలాపూరం చెరువుకట్ట పైన, గూడూరు గేట్ సమీపంలో అక్కడక్కడ గుంతలు ఏర్పడడంతో ఆత్మకూర్, చిన్నచింతకుంట, కురుమూర్తి స్వామి ఆలయానికి వెళ్లే వాహనదారులు తిప్పలు పడుతున్నారు. గుంతల మయంగా మారిన రోడ్డుపై అధికారులు దృష్టి సారించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.